### 1985 రక్తాక్షి సంక్రాంతి కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ

నేను టెలిఫోన్‌లో తెలుగులో మాట్లాడుతుంటే— పాపం ఆయనా తెలుగువాడు కాబోలు నావంక తదేకంగా చూస్తున్నాడు. పెద్దసైజు మీసాలతో బలమైన పెద్దమనిషిలా వున్నాడు. పాంటు షర్టుతో కాస్త బస్తీ వాసన తెల్సిన మనిషే అనిపించింది. బహుశా ఆ ప్రాంతంలో వున్న తెలుగువా రెవరింటికైనా వచ్చిన చుట్టమై వుండాలి.

# ఎర్రచీర

## కొవ్వాలి సాంబశివరావు

నేను నా షూటింగ్ పనులవల్ల ఖాళీలేక, దగ్గరే అయినా శాంతినగర్‌లో వున్న నా మిత్రుల ఇళ్ళకు ఈమధ్య వెళ్ళలేదు. దాదాపు పదినెలల తర్వాత ఈ రోజు వాళ్ళతో బాతాఖానీ కొట్టటానికి బయలుదేరాను. ఈ లోపు దారిలో వున్న షాపులో ఫోను చూసి, తాంబ్రంలో వున్న మిత్రుడు ప్రసాద్‌గారితో ఫోన్‌లో మాట్లాడుతూ వెనక్కి తిరిగి రోడ్డుమీదకు చూశాను. ఆహా! కళ్ళు చెదిరేలా రోడ్డుమీద ఓ మెరుపు మెరిసింది! "ఓహ్! బ్యూటీ ఇన్ రెడ్ శారి!" కాటుకకన్నుల చిన్నది. ఓరగా చూసి విసిరిందో చిరునవ్వు. నేను అనుకోకుండా చిలిపిగా కన్ను కొట్టాను.

"ఛీ" అంటూ వెళ్ళిపోయింది. సిగ్గుపడ్డ ఆడది పలికే మొదటి అక్షరం అది. నేను ఫోన్‌లో మాట్లాడటం పూర్తిచేసి వెనక్కి తిరిగాను. ఆ మీసాల పెద్దమనిషి నా కాలర్ పట్టుకున్నాడు. ఈ అనుకోని సంఘటనకు నాకు ఆశ్చర్యంతోపాటు కోపంకూడా వచ్చింది. కాని నిలదొక్కుకున్నాను. అది నా ఓర్పు కాదు—ఆయన నాకన్నా బలంగా వుండటమే.


"ఏం వుద్యోగం చేస్తున్నావ్ మద్రాసులో?" కోపంగా అడిగాడు. ఈ మాత్రం ప్రశ్న అడగటానికి అంతకోపంగా నా కాలర్ పట్టుకోనవసరం లేదు. కాలర్ పట్టుకున్నా తర్వాత సమాధానం చెప్పనూ అక్కరలేదు. అయినా చెప్పాను.

"సినీమాల్లో పనిచేస్తున్నావని, దారినపోయే ఆడవాళ్ళకు కన్నుకొడతావన్న మాట?" కోపంగానే వుంది ఆయనగారి చూపు. ఈసారి నాలోని కోపం కూడా పైకి తన్నుకొచ్చింది.

"అసలు వీడెవడు నన్నడగటానికి?" అదే మాట అన్నాను. "నా యిష్టం! నువ్వెవరోయ్ అడగటానికి? ముందు కాలర్ వదులు" అని విదిలించాను. నేనన్న "నా యిష్టం" అన్న మాటకు ఆయనకు వచ్చిన కోపం "నువ్వెవరోయ్" అన్న ఏకవచనానికి రెండింతలై, "రాస్కెల్- చేసింది వెధవ పని, పైగా నా యిష్టం అని దబాయిస్తావా? సంసారం చేసుకునే ఆడపిల్లకు కన్నుకొడతావురా?" అనటంతో పాటు ఆయన చెయ్యి బలంగా నా చెంపకు తాకింది. ఆ దెబ్బతో నా కళ్ళు బైర్లు కమ్మాయ్. నేనూ విసురుగా చెయ్ పైకి లేపాను. కాని మెలితిరిగి నా వెనకే ఆయన చేతిలో బిగుసుకుంది. అప్పటికే నే తిన్న దెబ్బవల్ల, కోపం వల్ల నా మొహం కందిపోయింది. తెలుగువాళ్ళు కాకపోయినా చుట్టుప్రక్కల చాలా మంది చూస్తున్నారు. నా కోపం మరికాస్త పెరిగింది. వీడెవడో కొత్తగా మద్రాసు వచ్చి, పది సంవత్సరాలుగా స్థిరపడ్డ నన్ను కొడతాడా? వీడి అంతు చూస్తాను అనుకుని, గట్టిగా "చెయ్యి వదులు! నువ్వెవడివిరా నన్నడగటానికి? మీవాళ్ళ కేవన్నా కన్నుకొట్టానా?" అన్నాను. మరోసారి నా గూబ పగిలింది. నా జుట్టు పట్టుకుని రోడ్డు మీదకు లాక్కెళుతూ "రారా చెబుతాను! ఎవరికి కన్నుకొట్టావో చెబుతాను. నీకెన్ని గుండెల్రా? నా కళ్ళ ముందే మా అమ్మాయికే కన్ను కొడతావట్రా? నిన్నిక ప్రాణాలతో వదల్ను" — "మా అమ్మాయికే కన్ను కొడతావట్రా? నిన్నిక ప్రాణాలతో వదల్ను" ఈ మాట దగ్గర నా బుర్ర బండబారిపోయింది. ఆయన పాపం ఈ మాటలకు సమపాళ్ళలో ఇంకా తెలుగు బూతులు కలిపి తిడుతున్నా నాకు వినిపించటం లేదు.

"వాళ్ళమ్మాయికా నే కన్ను కొట్టింది?..వాళ్ళమ్మాయా.. నేను పొరపాటుపడి వాళ్ళమ్మాయికే....అమ్మ బాబోయ్! కొంప మునిగింది. నా మిత్రుడు విష్ణువర్ధన్ ఇంటివైపు లాక్కెళుతున్నాడు. కొంపతీసి ఆయన చుట్టంకాదుకదా? అక్కడకు తీసుకెళ్ళి పంచాయితీ పెడతాడేమో? విష్ణువర్ధన్ నా మిత్రుడు కాబట్టి ఏదో పొరపాటైందని ప్రస్తుతానికి తప్పిస్తాడు. కాని నా పరువు? ఇక లాభంలేదని ఆలోచించి, ఈ భాగోతం ఏ తెలుగువాడు చూడటం లేదని నిర్ధారించుకొని ఆయన కాళ్ళమీద పడ్డాను.

"సారీ సార్: నాది పొరపాటైపోయింది. మీ అమ్మాయి అనుకోలేదు. ఎర్రచీర కట్టుకుంటేను మా....ఐ మీన్ మా ఆవిడ కూడా అలాంటి చీరుంది.... నేను చీర చూసి పొరపాటు పడ్డాను. క్షమించండి !"



"అంటే ఎర్ర చీర కట్టుకున్న ప్రతి ఆడదీ నీ పెళ్ళామేనా ఇడియట్.... (+ తెలుగులో బూతు)" ఆయన చెయ్యి పైకి లేచింది.

"లేదు సార్? నాదే తప్పు-క్షమించండి" బ్రతిమిలాడాను. మనిషి కాస్త శాంతించాడు.

"ఈసారి ఈ పక్క ఎక్కడన్నా కనపడ్డా, పిచ్చి పిచ్చి వేషాలు వేసినట్లు తెలిసినా, నీ ముక్కెలిరగ్గొడతాను జాగ్రత్త" అని ఫైనల్‌గా వార్నింగ్ ఇచ్చి వదిలాడు. చావుతప్పి కన్ను లొట్టబోయి ఇంటిదోవ పట్టాను.


కాని మనసులో నన్ను కొట్టాడనే బాధ, ఉక్రోషం.... అసలు వాడెవడు నన్ను కొట్టడానికి?

ఇంతకాలం ఇక్కడ పరువుగా బతుకుతున్నాను. సరదాకు చిన్న చిన్న తప్పులు చేసినా బయటపడకుండా గౌరవం కాపాడుకుంటున్నాను. ఈరోజు ఒక ముక్కూ మొహం ఎరగనివాడు నన్ను కొట్టడమా? మెయిన్ రోడ్డుమీద కెళ్ళి కాఫీ తాగుదా మనిపించింది. మళ్ళీ ఆ రోడ్డుమీద నడవగలనా? మనసంతా చికాకుగా వుంది. కాఫీ తాగుతున్నా అదే ఆలోచన. నన్ను కొట్టిన మనిషెవరు? ఏమైనాసరే వాడి అంతు చూడాలి. వాళ్ళమ్మాయికి కన్నుకొడితే మాత్రం నడిబజార్లో నన్నలా కొడతాడా? మద్రాసులో నా తడాఖా ఏమిటో చూపిస్తాను. మరో కాఫీకి ఆర్డరిచ్చి సిగరెట్ వెలిగించాను.

మళ్ళీ అదే ఆలోచన....

ఎక్కడైనా వంటరిగా ఏ గదిలోనో పెట్టి కొట్టినా ఇంత బాధుండేదికాదు....నడిబజార్లో....ఛీ....!

"ఏమండి, సాంబశివరావుగారూ! ఈ మధ్య చాలా బిజీగా వున్నారా అసలు కనపట్టంలేదు?" అంటూ నవ్వుతూ వచ్చి పక్కన కూర్చున్నారు ప్రఖ్యాత డిటెక్టివ్ రచయిత కొప్పిశెట్టిగారు. ఆయన్ని చూడగానే నా ప్రాణం తిరిగొచ్చింది. ఈయన వుంటున్నది కూడా "శాంతినగర్"లోనే. పైగా డిటెక్టివ్ రచయిత గదా? ఆ మీసాలవాడి గురించి ఈ పాటికి ఈయన అన్ని వివరాలూ సేకరించే వుంటాడు. ఈయన్ని అడిగితే వాడి వివరాలూ ఆచూకీ తెలుసుంది అనుకుని నవ్వుతూ, షూటింగ్ వివరాలు చెప్పి, ఆయనకో కాఫీ ఆర్డరిచ్చాను. కుశల ప్రశ్నలు, జవాబుల శీర్షికానంతరం మెల్లిగా "మీసాలున్నాయనెవరన్నా కొత్తగా శాంతినగర్‌లోకి కాపరం వచ్చారా?" అన్నాను.




"మీసాలున్నాయనా?" అన్నాడు తన మనసులో వున్న పాత కె.డి లిస్టు తిరగేస్తున్నట్లు సాలోచనగా.

పాపం ఎంత ప్రఖ్యాత డిటెక్టివ్ రచయిత అయితే మాత్రం హంతకుడి ఆచూకీ వుత్త మీసాల గుర్తుతో కనుక్కోవాలంటే కష్టమే. కనీసం మీసాల సైజన్నా చెబితే....

"కొంచెం పెద్ద మీసాలుంటాయ్" అన్నాను ఓ సిగరెట్ ఆయనకిచ్చి, అగ్గిపుల్ల గీస్తూ ఆశగా.

ఆయన ఓ దమ్ము గట్టిగా పీల్చి గర....గర—మనిపించి మరలా తిరుగుతున్న సీలింగ్ ఫాన్ వంక చూస్తూ పొగ రింగులుగా వదిలి.

"నల్లగా బొద్దుగా వుంటారా?" అన్నారు.

ఆహా! నా ఆనందం కనబర్చకుండా "అవును" అన్నాను, బేరర్ తెచ్చిన కాఫీ ఆయన దగ్గరకు తోస్తూ.

ఓహో! ఏవైనా డిటెక్టివ్ రచయితలకు ఈ దేశంలో ఎవరూ సాటిరారు. ఏ చిన్న ఆధారం చూపించినా వాళ్లు దాంతో హంతకుడి ఆచూకీ ఇట్టే పట్టేయగలరు. వాళ్ళకు చేతకానిదల్లా పోలీసుకుక్కల్లాగా వాసన బట్టి హంతకుడ్ని పట్టుకోగలగడం వక్కటే. అది కూడా ఈ మధ్య చేస్తున్నారేమో?ఈ మధ్య నేను డిటెక్టివ్ పుస్తకాలు చదవటంలేదు.

"పాంటు షర్టు వేస్తారు. వయసు యాభై సంవత్సరాలుంటాయి". వివరాలు చెప్పుకుపోతున్నారు. కాఫీ ఆఖరి సిప్ చేస్తూ "ఆ! అవును వాడే...." అనబోయి ఎందుకన్నా మంచిదని "అవును" అన్నాను. తొందరగానే దొరుకుతున్నాడనే ఆనందంతో ఆయన వద్దంటున్నా మరో రెండు కాఫీలకు ఆర్డరిచ్చి ఆయన వంకే ఆశగా చూస్తూ కూర్చున్నా.

"బాబూరావ్‌గారని. ఈమధ్యే, అంటే షుమారు ఓ ఆరు నెలల క్రితం విజయవాడనుంచి వచ్చి మన విష్ణువర్ధన్ ఇంటి ప్రక్కనే అద్దెకుంటున్నారు. డిటెక్టివ్ బుక్స్ పబ్లిష్ చేస్తారు. చాలా మంచి మనిషి. శాంతినగర్‌లో వున్న తెలుగు వాళ్ళను మంచికీ చెడుకూ ఆదుకుంటూ చాలామంచిపేరు సంపాదించారు. ఆయనకు ఒక అబ్బాయి, అమ్మాయి...." సర్వర్ తెచ్చిన కాఫీ సిప్‌చేస్తూ చెప్పుకు పోతున్నారు. నాకు కాఫీ మింగుడు పడటంలేదు. మరో సిగరెట్ వెలిగించాను. నేను సర్వర్‌కి కాఫీకి డబ్బులిస్తుంటే కొప్పిశెట్టిగారు మళ్ళీ ప్రారంభించారు-"ఆయనఇవ్వాళే ఎవరో వెధవని కొట్టారట!.." నే పీల్చిన పొగ మింగేసాను ఆయన వంక అనుమానంగా చూస్తూ.

"వెధవ: రోడ్డుమీద ఆడపిల్లకు కన్నుకొట్టాట: ఈయన 'తప్పుకాదా?' అని మందలిస్తే "నా యిష్టం నువ్వెవడివి" అన్నాట్ట. మా దగ్గరకు లాక్కురాలేక పోయేరా కళ్ళు పీకేద్దుం అన్నాం. కాళ్ళు పట్టుకు ఏడ్చాడని వదిలేశారట. పాపం జాలి గుండె. మనవాళ్ళుకూడా మరీ పోకిరీ వెధవల్లా తయారవుతున్నారు. అవునూ....ఆయనతో మీకు పరిచయం.... ఓహో! షూటింగ్స్ బిజీలో మీరు ఈ మధ్య అటు రాలేదుకదూ. ఆయన్నెప్పుడు చూశారు?" అన్నాడు.

నాకు ఈయనమీద అనుమానం పెరిగింది. ఈయన కథలు రాసుకుంటూ మధ్యలో కాఫీకి వచ్చాడా? లేక నన్ను కొట్టినవాడి ఆచూకీ తెల్సుకోవడానికి వచ్చాడా? ఏదైనాసరే ఈయన దగ్గర మనం బయటపడకూడదు. అనుకొని తేలుకుట్టిన దొంగలా పైకి ఓ చిరునవ్వు నవ్వి. "అదే! ఇందాక ఈయన ఎవరినో తిడుతున్నపుడు అటుగా వచ్చాను. చేతిలో కూరల సంచీ అదీ వుంటేను ఈయనెవరా ఇదివరకెక్కడా చూడ్లేదు అనుకొన్నాను.

మనిషి చాలా మంచి వాడ్లా వున్నారు." అన్నాను తప్పించుకోటానికి. రచయితగారు లేస్తూ, "చాలా మంచి మనిషి! రండి! అలా మా ఇంటికి వెళదాం. ఆయన్ని కూడా పరిచయం చేస్తా" అన్నారు. నా గుండె 'లబ్ డబ్' అనటం మానేసి 'లబో దిబో' అంటున్నట్లనిపించింది. ఇప్పుడు మళ్ళీ అక్కడికి వెళితే వీళ్ళ ముందు పరువుపోతుంది. ఇప్పటి దాకా వీళ్ళంతా నేనేదో పెద్ద మనిషనుకుంటున్నారు. ఇప్పుడు అలా కన్నుకొట్టి



దెబ్బలు తిన్నది నేనేనని తెలుస్తే నా బతుకు చిల్లి కుండ అవుతుంది. కొన్నాళ్ళు వీళ్ళను తప్పించుకు తిరగటం మంచిది.

"ఈ రోజు పొద్దునే కదా సార్! షూటింగ్ నుంచి వచ్చాను. కాస్త రెస్టు తీసుకుని సాయంత్రం వస్తాను" అని తప్పించుకున్నాను. ఇప్పుడు నా పరిస్థితి మరీ దారుణమైపోయింది.

ఈ మీసాల బాబూరావ్ ఎవర్రా నాయనా—నాఖర్మ కొద్దీ వచ్చాడు. అసలు ఎవరైతే నేం? నాకు మాత్రం బుద్ధి వుండద్దూ? రోడ్డు మీద పోయే ఆడదానికి కన్ను కొట్టే రోగం ఏమిటి? "ఛీ-ఛీ" నా చెంపలు నేనే కొట్టుకున్నాను.

"ఎన్నా సార్? ఎన్నాచ్చి?" అన్నాడు అది చూసిన ఓ అరవమాలోకం.

"ఏం లేదులేవయ్యా" అంటూ ఇంటి దోవపట్టాను. నాకేదో పిచ్చిపట్టిందనుకుంటున్నాడు పాపం వాడు.

ఇప్పుడు కాకపోయినా తర్వాతన్నా "శాంతినగర్" లో వున్న నా మిత్రులందరికీ ఆ దెబ్బలు తిన్నది నేనేనని తెలుస్తుంది. వాళ్ళు నన్ను మన పల్లెసీమల్లో పూరిబయట పొదల్లో పొర్లొచ్చిన ఊరపందిని చూసినట్లు చూస్తారు.

ఎలా పరిస్థితి నుంచి తప్పించుకోవటం. పోనీ ఆ మీసాలాయన్ని మళ్ళీ ఓసారి ఒంటరిగా కలిసి కాళ్ళు పట్టుకుని ఈ విషయం ఎవరికీ చెప్పద్దని బ్రతిమాలితే. 'ఛీ' పరువుతక్కువ. జరిగిందేదో జరిగింది—మళ్ళీ అటుపక్కకి వెళ్ళను. వీలైతే వెంటనే ఇల్లుమారి దూరంగా వెళ్ళటం మంచిది.

"ఏవండి: కులాసానా?" ఆర్టిస్టు నల్ల గంగాధర్‌గారి పలకరింపుతో ఈ లోకంలోకి వచ్చాను. మామూలు పలకరింపులు కౌగిలింతల తర్వాత.

"టి" నగర్‌లో ఏదన్నా ఇల్లుంటే చెప్పండి. ఆ సైడుకు పచ్చేద్దామనివుంది. ఇక్కడేదో పూరికి దూరంగా వున్నట్లుగా వుంది" అన్నాను.

"ఎంతలో కావాలి?" ప్రశ్నించాడు.

"మూడు వందల యాభై దాకా ఫరవాలేదు. రెండు గదులున్నా చాలు, సెపరేట్ బాత్‌రూమ్ వుండాలి" ఇది నా మామూలు కోరిక.

"చూస్తానండి! ఏదన్నా వుంటే ఈసారి వచ్చినప్పుడు చెబుతా: మా ఇంట్లో బాత్ రూమ్ పక్కగా చిన్న గది పైన రేకుతో కట్టించాను ఒక మనిషి వుంటానికి సరిపోతుంది. ఎవరన్నా ఎరుగున్న వాడు. మంచివాడు అయితే చెప్పండి. నెలకు వంద రూపాయిలు అద్దె" ఎడారిలో ఎయిర్‌కండిషన్డ్ రూమ్ దొరికినంత ఆనందంతో "ఆ రూమ్ నాకిప్పించండి" అన్నాను.

"అబ్బే ఆ గది మీకు చాలదండి. చాలా చిన్నది. కిటికీలు లేవు. వేసవికాలం చాలా కష్టం. సెపరేట్ బాత్‌రూమ్ లేకపోగా, కామన్ బాత్‌రూమ్ ప్రక్కనే వుంది. పైగా మీరు కాబోయే డైరెక్టర్. ఎవరన్నా వస్తే కూర్చోటానికి అదీ బాగోదు. ఓ నెల రోజులు ఓపిక పట్టండి. మంచి పోర్షన్ చూపిస్తాను" పాపం నామీదున్న సదభిప్రాయంతో అన్నారు!

"అలా కాదు. నేనిక్కడెందుకో ఉండలేకపోతున్నాను. ఒకవేళ మంచి పోర్షన్ దొరికితే అప్పుడు మారతాను. మీరీ అడ్వాన్స్ వుంచండి" అని వంద కాయితం తీసి. "ముందు గది చూడండి" అని ఆయన అంటున్నా వినిపించుకోకుండా ఆయన చేతిలో పెట్టి "వీలైతే రేపే మారతా" అన్నాను.

కాదనలేక జేబులో పెట్టుకుని వెళ్ళిపోయాడు.

ఇంత అర్జంటుగా ఇల్లు దొరికినందుకు ఆనందపడుతూ 'ఈరోజే ఇల్లు మారితే మంచిదేమో' అన్న ఆలోచనతో ఇంటి దోవ పట్టాను. మా ఇంటి సందు తిరగ్గానే నా గుండె జలదరించడంతోపాటు నా కాలికి బ్రేకులు పడ్డాయి. నా మిత్రులు విష్ణువర్ధన్, డిటెక్టివ్ రచయితలు కొప్పిశెటి, పానుగంటి గార్లు మా ఇంటిముందు నిలబడి వున్నారు. నన్ను కొట్టిన ఆ మీసాలాడు మా ఇంట్లోకి వెళ్తున్నాడు. అసంకల్పిత ప్రతీకార చర్యగా నా కాళ్ళు వెనక్కి తిరిగాయ్.

ఇప్పుడు వాళ్ళ మధ్యకు వెళితే నా పరువు నా ఇల్లాలి దగ్గర కూడా పోతుంది. జీవితంలో ఇంతకన్నా నరకం వుండదు.


అయినా కన్ను కొట్టింది నేనేనని వీళ్ళు ఎలా అనుకొని ఇంటికొచ్చారబ్బా? ఈ మీసాలాయన నన్ను అంతటితో వదిలిపెట్టక ఇలా...."ఛీ" ఈ రోజు ట్రైన్‌లో నిద్దరలేచి ఎవరి మొహం చూశానో వీడిచేతిలో పడ్డాను. ఇంట్లోను బయటా నా పరువు తీస్తున్నాడు. నా ఫ్రెండ్స్‌తోనే నా కోసం నా ఇంటి దగ్గరే కాచుక్కూర్చున్నాడంటే? నేనెవరో, నా ఇల్లెక్కడో ఎలా తెలిసింది? ఆ ప్రక్కనున్న నా స్నేహితులు అక్కడ గొడవ జరుగుతున్నప్పుడు లేరు. ఆ మీసాలాడికి నేనెవరో తెలియను....మరి....ఆ! ఇది ఆ డిటెక్టివ్ రచయితలపనే అయి వుంటుంది.

వాళ్ళు. వాళ్ళ కథల్లో సిగరెట్ ముక్కతో హంతకుడి ఆచూకీ పట్టుకున్నట్లు రాస్తుంటారు. అలాగే ఇందాక ఆ మీసాలాడు నా జుట్టు పట్టుకు లాగినప్పుడు ఏదో ఓ వెంట్రుక అతని చేతిలో మిగిలి వుంటుంది. ఇందాక కొప్పిశెట్టి కాఫీకని వొచ్చి.... "అమ్మ....ఎంత దుర్మార్గుడు: నా కాఫీ తాగి, నాసిగరెట్ కాల్చి. ....నాకు తెలియకుండా నా వెంట్రుకేదో లాగేసి వుంటాడు. ఆ మీసాలాడి చేతిలో మిగిలిన నా వెంట్రుకా. ఈ వెంట్రుకా కలిపి పరిశోధించి వాటి ఆధారంతో నన్ను నేరస్థుడుగా నిర్ధారించి ఇక్కడికి వచ్చుంటారు. ఈ డిటెక్టివ్ రచయితలంత ద్రోహులు దుర్మార్గులు దేశంలో ఎవరూ వుండరు.

నాకు ప్రస్తుతం వాళ్ళను తప్పించుకోవటం మంచిదనిపించి పక్కనున్న "టీ"స్టాల్‌లో దూరాను. వెనుక నుంచి చప్పట్లు

"సాంబశివరావుగారూ!...." అన్న విష్ణువర్ధన్ పిలుపు.

అయ్యబాబోయ్: వాళ్ళు నన్ను చూడనే చూశారు. అయినా విష్ణువర్ధన్ నాకు చాలాకాలంగా స్నేహితుడు కదా, పైగా నేనాయనకు అయిదు వందల రూపాయిలు బాకీవున్నాను



కదా! అది ఎగ్గొడతానన్న భయంతోనైనా "ఏదోలెండి మన వాడే పొరపాటైందని" సర్ది చెప్పొచ్చు కదా? అసలు వీళ్ళకు ఇల్లు చూపించింది ఈయనే అయ్యుంటాడు. చూస్తాను.

ఎక్కడికి పోతాడు? నన్ను డబ్బు ఇవ్వాలని ఏ మొహం పెట్టుకు అడుగుతాడో చూస్తా....ఆ అయిదు వందలూ ఎగ్గొట్టక పోతే నా పేరు....!!

వినపడనట్లు లోపలకెళ్ళి ఓ "టీ"కి ఆర్డరిచ్చాను. వాళ్ళకు కనపడకుండా వుండాలని ఓ మూలగా కూర్చున్నాను. ఆ మీసాలాడు తప్ప మిగిలిన ముగ్గురూ టీ స్టాల్ ముందు కొచ్చారు. "లోపలున్నారు పిలవండి" అంటున్నారు రచయిత లిద్దరు విష్ణువర్ధన్‌తో వీళ్ళెంత డిటెక్టివ్ రచయితలైతేమాత్రం వీళ్ళెప్పుడూ జీవితంలో ఇలాటి తప్పులు చేసుండరా? వీళ్ళ తెలివి నన్ను పట్టుకోటానికే ఉపయోగించాలా? పైగా ముసి ముసి నవ్వులు, ఎవరన్నా చిన్న తప్పో, పొరపాటో చేస్తే వాణ్ణి నలుగురిలో వెధవని చెయ్యడానికి అంతా సిద్ధమైపోతారు. "టీ" తాగబుద్ధి కాలేదు. ఆ మీసాలాడి మీద కన్నా వీళ్ళ మీద కోపం, ద్వేషం, పగ పెరిగింది.

ఏమైనా సరే ఆ విష్ణువర్ధన్‌కు ఇవ్వాల్సిన డబ్బు ఎగ్గొడతాను ఈ కొప్పిశెట్టి, పానుగంటి రాసే డిటెక్టివ్స్ ఏవీ బాగో వని, పనికట్టుకుని మరీ వూరూరూ తిరిగి చెప్తాను.

ఈరోజే వీళ్ళ పుస్తకాలు చదివే నా ఫ్రెండ్స్‌కు ఉత్తరాలు రాస్తా. కాదు టెలిగ్రామ్స్ పంపుతా. నాకు తెలిసినంతలో వీళ్ళ పుస్తకాలు ఎవరూ చదవకుండా చేస్తా. అప్పుడుగాని వీళ్ళ మీద పగతీరదు...."ఛీ" ఇంకో రోజు షూటింగ్ పెరిగినా ఈ గొడవ జరిగుండేదికాదు. ఇలా పరువూ పోయేదికాదు. ఏడవాల నన్నంత బాధకల్గింది. ఈలోపు విష్ణువర్ధన్ వచ్చాడు.

"ఏ వండీ! షూటింగ్ నించి వచ్చి కూడా కనపడకుండా తిరుగుతున్నారేం?" అన్నాడు చిరునవ్వుతో మొహంపెట్టి.


నాకా నవ్వు వెక్కిరింపులా అనిపించింది.

అవును వెక్కిరింపే....

....వెక్కిరింపే....

నే చేసిన తప్పు గురించి వీళ్ళకు భయపడితే ఇలాగే ఆట పట్టిస్తారు. కల్తీ నూనె పొయ్యిమీద పొంగినట్లు నా కోపం, మొండితనం పొంగాయి. ఎంత ఓర్చుకున్నా ఇది సహించటం కష్టం.

"నా ఇష్టమండి. షూటింగ్ నుంచి వచ్చినా, ఖాళీగావున్నా మీకు కనపడను. నేను కన్ను కొడతాను. నా....యి....ష్టం..




తన్నులు తింటాను నాయిష్టం. ఏం? మీరంతా కలిసి మళ్ళీ కొడతారా? కొట్టండి. వాళ్ళమ్మాయని నాకు తెలియదు. కాదు....తెలుసు....కావాలనే వాళ్ళమ్మాయికి కన్నుకొట్టాను. ఏం చేస్తారు? చంపేస్తారా! చం....పం...డి....మీ నలుగురే వచ్చారే. "శాంతి నగర్" లో అందరినీ తీసుకురాలేకపోయారా? సత్యనారాయణ గార్ని చంద్రమోహన్ని కూడా వెంటబెట్టుకురాలేకపోయారా?

ఏం వాళ్ళు ఊళ్ళో లేరా....?"

దెబ్బతో విష్ణువర్ధన్ మొహంలో నవ్వు మాయమయింది. నా అరుపులు విన్న కొప్పిశెట్టి, పానుగంటి, హోటల్‌లో వాళ్ళు బిగుసుకుపోయి చూస్తున్నారు. నేనెందుకు అరుస్తున్నానో అర వ్వాళ్ళకి అర్థంకాలేదు.

"సార్! నీంగ వెళియపోయి పేసుంగ" అన్నాడు.

ఆఖరుకు మా వీధిలో వున్న హోటల్ వాడి దగ్గర కూడా నా పరువు పోయింది.

"వెళ్తాలేవయ్యా, బయటకు వెళ్ళే మాట్లాడుతా-ఏం? నాకేవన్నా భయమనుకున్నావా?" వాడి 'టీ' డబ్బులు వాడి మొహాన కొట్టి విసురుగా బయటకి వచ్చాను.

నిండా మునిగాక చలేమిటి? ఏమైతే అదయింది.

"రండి! మా ఇంటి దగ్గరే తేల్చుకుందాం" అంటూ వెనక వాళ్ళను పట్టించుకోకుండా విసురుగా ఇంటికి దారి తీశాను.

కోపంగా ఇంట్లోకి అడుగు పెట్టాను. ఆ మీసాలాడు నా ఇంట్లో కూర్చుని కాఫీ తాగుతున్నాడు.

ఆహా! ఏం దర్జా. నన్ను కొట్టి, నా వెనకపడి నా ప్రాణం తీస్తూ, నా ఇంట్లోనే కూర్చుని దర్జాగా కాఫీ తాగుతున్నాడు. నా కోపం తారాస్థాయికి చేరింది.

"ఒరేయ్! నిన్ను...." మళ్ళీ కొడతాడని కాస్త భయమేసింది.

"ఏమండి! నిజమే నే తప్పు చేశాను. మీరు దానికి నన్ను కొట్టారు-క్షమించమని కాళ్ళుపట్టుకున్నాను. మీరు పెద్దమనుషులు కదా? ఇలా నావెంటపడి వేధిస్తారా? బయట నా పరువు ఎలాగూ పోయింది. నా ఇంట్లో కూడా మొహం ఎత్తుకు తిరక్కూడదనా మీ ఆలోచన" అన్నాను ఆవేశంగా. కాఫీ తాగటంమాని నావంక ఆశ్చర్యంగా చూస్తుండిపోయాడు.

ఆయన మొహంలో కొద్దిగా రంగులు మారుతున్నాయి. నాకీ అవకాశం వదులుకోకుండా ఊచరకొట్టి బయటకు పంపాలని పించి ఆయన చేతిలో కాఫీ కప్పు లాక్కున్నాను. "మిమ్మల్నే అడిగేది! మీరు కావాలంటే ఇంకో రెండు దెబ్బలెయ్యండి కాని ఇలా బ్రతుకు అల్లరిపెట్టడం పెద్దమనిషి తరహా కాదు!" ఈ ఆఖరు మాటకు ఆయనకు కోపం వచ్చుండాలి. లేచి నిలబడ్డాడు. కోపం వస్తే వస్తుంది. ఏం? చంపుతాడా? నేను ఏ మాత్రం తగ్గదల్చుకోలేదు. ఏమైనాసరే అనే మొండి ధైర్యంతో, "ఏం కొడతారా? కొట్టండి చూస్తా" అన్నాను పెద్దగా.

ఈనా అరుపులకు కంగారు పడి లోపల్నించి మా ఆవిడొచ్చింది.

"ఏమైందండీ! ఆయనేదో మిమ్మల్ని చూసి పోదామని వస్తే! ఆయన మీద అరుస్తున్నారు...."

నా భార్య....

ఎర్ర చీర....


అదే చీర....

నే కొన్న కొత్త చీర

అవే కాటుక్కళ్ళు ఇందాకనే కన్ను కొట్టింది ఈ చీరకే.

సందేహం లేదు.

"ఈయనే మా వారు" అంది నన్ను చూపిస్తూ ఆయన్తో.




"నోరుమ్మయ్ .... ఇందాక ఈ చీర కట్టుకుని బయటికి వెళ్ళావా?"

నా కోపానికి కారణం తెలియని నా ఇల్లాలు "వెళ్ళాను" అంది భయంగా.

"ఎక్కడి కెళ్ళావ్?"

"విష్ణువర్ధన్ అన్నయ్యగారింటికి....ఏమైందండి ఇప్పుడు?"

"నో....యు....య్....రాస్కెల్. నే అడిగిందానికి ముందు సమాధానం చెప్పు. నే కన్ను కొట్టింది నీకేనా?"

"ఛీ....వూరుకొందురూ...."అంది సిగ్గుపడుతూ.

"నీ సిగ్గు మండ నీ....కే....నా కన్నుకొట్టిందీ అంటున్నాను. నాకు సమాధానం కావాలి."

ఆయన తిరిగి కూర్చుంటూ మీసాల్లోంచి కొన్ని పళ్ళు బయటపెట్టాడు. అది ఆయన చిరునవ్వు అయివుండొచ్చు.

"అయితే ఇతనే మీ ఆయనన్నమాట."

"అవునండి. బాబూరావ్‌గారని విష్ణు అన్నయ్యగారింటి.."

"నాకు తె....లి....సు"అన్నాను చిరాగ్గా. హోటల్ దగ్గర మిత్రులు తీరిగ్గా నచ్చారు.

"నువ్వెంత చిరాకుపడ్డా నువ్వు కన్నుకొట్టింది మా అమ్మాయికేనయ్యా" అన్న మాటలు మీసాల్లోంచి వినవచ్చాయి.

"మళ్ళీమీ అమ్మాయంటారేంటండి మీఎదురుగా నా పెళ్ళాం తనకే నే కన్నుకొట్టానని సిగ్గుపడి చస్తుంటే."

ఆయన హార్మోని పెట్టెలో ఆఖరి మెట్ల శబ్దంలానవ్వుతూ "హ్హి..హ్హి..హ్హి. అవునయ్యా! నీ పెళ్ళామే.... మా అమ్మాయి! మీ ఆవిడఈ ఆరు నెలలనుంచీ నన్ను బాబాయ్ అనిపిలవటంవల్లా, నిన్ను ఇదివరకు నేను చూడకపోవడం వల్లా, నువ్వెవరో పోకిరీ వాడివనుకుని తొందరపడ్డాను. ఇహ నీ కన్నూ.... హ్హి....హ్హి....మీ ఆవిడ- నీ యిష్టం- హ్హి....హ్హి....హ్హి" అన్నారు మీసాలు దువ్వుకుంటూ.

"ఆ కాఫీ కప్పు బాబాయ్‌గారికి ఇచ్చేయండి" అంటూ సిగ్గుపడుతూ లోపలికెళ్ళింది. మరో నాలుగు కప్పులు కాఫీ కలవటానికి నా ఇల్లాలు.

వెనకాల వున్న విష్ణువర్ధన్, కొప్పిశెట్టి, పానుగంటి గార్లు కూడా మీసాల బాబూరావుగారి నవ్వుతో శృతి కలిపారు.

ఇక పొరపాటున కూడా వంటరిగా వున్నా, పెళ్ళానికి కూడా కన్ను కొట్టకూడదని నిర్ధారించుకొని నేనూ హార్మోని పెట్టె ఆఖరి మెట్లతో శృతి కలిపి తప్పనిసరై నవ్వాను. ★

